

# కాళికాలయం

*భూతకాలం ఒక పెనుభూతమై కళ్ల ఎదుట సాక్షాత్కరించి, భవిష్యత్తును బరువుగా బాధగా నిబిడాంధకారంగా చేసివేసినట్లు తోచింది లచ్చికి. గతాన్ని నెమరువేసుకోగానే కడుపు చెరువై దుఃఖం పొంగి పొరలింది. సముద్రంలోని కెరటాలకు మల్లే. ఇంతకూ ఆమె చేసింది పొరబాటా? ఏమో!*

---

ఏతాలవంకదాటి, ఎనుపోతులమిట్టదాటి, వెంకన్నకుంటదాటి, కంటికి భీకరమైన కారెనుముల అడవికి సమీపంగా, ఆకాశమంత ఎత్తున ఏపుగా పెరిగిన మర్రిమానుకు ముందున్న కాళికాలయం దగ్గరికి వచ్చి ఒంటరిగా నిలబడింది లచ్చి. పాడుపడిన ఆలయ ప్రాంగణంలోని నాలుగు స్తంభాల ఓటు మంటపం క్రింద కూర్చుని, ఒక్క నిట్టూర్పు వదిలింది, భయంగా నాలుగు వైపులా కలయజూస్తూ

దడ దడలాడే గుండెను దిటవు చేసుకొని భయంతో గజగజలాడే మనస్సును రాటుగా, మోటుగా చేసుకోటానికి దాటుగా ప్రయత్నిస్తూ, పైటచెరుగుతో ముఖంమీది చెమట బిందువులను తుడుచుకుంది లచ్చి. కళ్ళుకానని కటిక చీకట్లో, మిట్టపల్లాల డొంకదారిలో పరుల కంట పడరాదని, దొంగలా చెట్లూ చేమా ముల్లూమునకా చూడకుండా పరుగెత్తివచ్చినందున ఆయాసం ముంచుకొచ్చి, కడుపులోని

పసికంద కదలికతో డొక్కలో పోటుపొడిచి నట్లయింది లచ్చికి. బాధగా మూలిగి, పైటను ప్రక్కగా చేసుకొని మోచేతిమీద తల ఆన్చి పడుకొంది లచ్చి.

భూతకాలం తనపేరిట ఒక పెనుభూతమై కళ్ల ఎదుట సాక్షాత్కరించి, భవిష్యత్తును బరువుగా, బాధగా, నిబిడాంధకారంగా చేసివేసి నట్లు తోచింది లచ్చికి. గతాన్ని నెమరు వేసు కోగానే కడుపు చెరువై, దుఃఖం పొంగి పొరలింది, సముద్రంలోని కెరటాలకు మల్లే.

తనుచేసింది పొరబాటా? ఏమో!

తను రంగన్న మామను మంచివాడుగా, మొనగాడుగా, న్యాయపరుడుగా తలచి మనస్సుతో పాటు సర్వస్వాన్ని సమర్పించుకోవటం—దీపవు కాంతిపుంజాన్ని మాత్రం చూచి, కాలుతుందన్న విచక్షణాజ్ఞానాన్ని విడనాడి ముద్దు పెట్టు కోవడం, మూతికాలిన తర్వాత ముద్దు పెట్టు కొన్నందుకు చింతించడం లాంటిదేమో!

రంగన్నమామ మంచివాడు. మొనగాడేకాదు, వరుసకు మేనమామకూడా. తన నోమారు ఒక ఆపదనుంచి రక్షించాడు కూడా. అలాంటి వ మామను తను మనసారా నమ్మటం, వాంఛించ టంలో తన తప్పేముంది? అసలు ఆనాడు రంగన్న మామే సమయానికి వచ్చి అడ్డు తగలకుంటే తనే మయ్యేది? ......

తండ్రి సంతకని పుంగనూరుకు వెళ్లాడు. కుందేళ్లు, జింకలు వచ్చి పైరు మేయకుండా ముసు మాపటివేళదాక మంచె మీదుండి కావలి కాయమన్నాడు సంతకు పోతూ. తనలాగే ఎనిమిద్దాకా మంచెమీదుండి ఒంటరిగా మామిడితోపు దారిని ఇంటికి వస్తూంది. ఎప్పటినుంచి కాపేసిఉన్నాడో నరిసిగాడు వెనుకనే వచ్చి రెక్క పట్టుకున్నాడు. విడిపించు కోవటానికి శాయశక్తులా ప్రయత్నించింది తను. సాధ్యం కాలేదు. కొవ్వెక్కిన కరిలా కామాంధ కారంతో తనను కావలించుకున్నాడు నరిసిగాడు. తన కావేశం ముంచుకొచ్చింది. గోళ్లతో మొహాన్ని రక్కి, నరిసిగాని కౌగిట్లోనుంచి విడివడి, జారిపోయిన పైట సన్నా సర్దుకో కుండా, రెండు చేతులతోనూ బలంగా ఒక్క త్రోపు తోసింది తను నరిసిగాణ్ని. ఏనుగులా ఉన్న నరిసిగాడు ఆ త్రోపుతో పర్వతంలా ఉన్న మామిడిమాను బోదెకు ఢీకొన్నాడు. ఆ దెబ్బకు నరిసిగాని తల పగిలి, తలలోనుంచి ఏకధార కట్టింది రక్తం. ఆ దెబ్బతో రెచ్చిపోయి నరిసిగాడు సింగంలా తనమీదికి దూకి రెండు చేతులతోను కంఠాన్ని బలంగా నొక్క నారంభించాడు. తను అరవ టానికైనా ఆస్కారం లేదు. ఏనుగు కాలిక్రింది ఎలుకలా అతని చేతుల్లో గిల గిలలాడిపోతుంది తను. ఇంకో రెండు క్షణాల్లో తనకీ భూమి మీద నూకలు చెల్లిపోయేవే. అంతలో ఎక్కడ నుంచో దేవునిలా ప్రత్యక్షమయ్యాడు రంగన్న మామ.

పీకపిసుకుతున్న నరిసిగాని చొక్కా కాలరు పట్టుకుని చెంపమీద ఒక్కటి ఇచ్చాడు రంగన్న మామ. ఆదెబ్బతో గిరగిరలాడిపోతూ భూమి మీద వాలిపోయాడు నరిసిగాడు. "మనుస్సులో ఉంచుకో! లచ్చివాది. అది నా సొత్తురా! దాని మీ దేవరు కన్నేసినా ఈ రంగ ఊరుకోడు. ఆ దేవడైనా సరే! అని నెత్తురు కళ్ల జూచిగానీ వదలను. ఏమనుకున్నావో, జాగ్రత్త" అన్నాడు కోపంగా మీసం మెలేస్తూ.

'లచ్చివాది, నా సొత్తురా!' అని రంగన్నమామ అనిన మాటలకు తనకు చచ్చేంత సిగ్గైంది ఆనాడు. ఆనాడే తన మనస్సును రంగన్నమామ పాదార్పితంచేసింది లచ్చి. ఆనాటినుంచే తనమీద అక్కసు మొదలైంది నరిసిగానికి. ఎలాగైనా తననుంచి రంగన్నమామను వేరుచేసి ఇద్దరికీ కాకుండా చేయాలని పట్టుపట్టాడు. రంగన్న మామ అయ్య గంగడు. గంగనితో నేస్తంమొద లెట్టాడు నరిసిగాడు. కాల్చడానికి ఒక బీడీ ముక్క ఇచ్చి ఆడమంటే 'రంగమర్కటం' లా ఆడే చచ్చుకరకం చవట గంగడు. బీడీ మోటులతో మొదలైన నేస్తం నరిసిగాడు చెప్పిందే వేదం అనేటంత వరకు వచ్చింది గంగనికి. తనపైన లేనిపోని కబుర్లు చెప్పి, మేన రికాన్ని కాదనిపించి, ప్రక్కఊళ్లో పిల్లను చూపి, రంగన్నమామకు శీఘ్రంగా పెళ్లి చేసేయమని గంగని ఒప్పించాడు నరిసిగాడు

రెండు ఉదయాలు గడిచిపోతే రంగన్న మామకు పెళ్లి. 'లచ్చీ నువ్వు నాప్రాణానివి' అన్న రంగన్నమామ మూడో నాటి ఉదయాన తన మెడలో కాక, మరో ఆడదాని మెడలో పసుపు దారం కడుతాడు. రంగన్నమామ మరో ఆడదాని మెడలో దారం కడితే ఆదే తనగొంతుకుఉరి త్రాడు.

ముసు మాపటివేళ, ముసిరిన చీకట్లో మంచినీళ్లబావికాడ తారసిల్లాడు రంగన్నమామ. 'మావా! నాగతి ఏమయ్యేది మావా' అని కన్నుల్లో నీళ్లు పెట్టుకుంటే 'దిగులుమానేసి, రాయి కరిగేపొద్దు కాడ, కాళికామ్మోరు గుడికాడ, కలవ్వే లచ్చీ' అన్నాడు రంగన్నమామ.

ముందు వెనుకలు చూడకుండా రంగన్న మామ నిజాయితీని పురస్కరించుకొని, మన సుతోపాటు తనువునూ సమర్పణచేసుకున్నందు వలననే తనకీ నాడు ఈగతి పట్టింది గట్టిగా నిట్టూర్చింది లచ్చి.

ఎండిన మర్రిఆకులపై చప్పుడైంది. మనిషివచ్చినట్టు అలికిడైంది. లచ్చి పర్తు



మబ్బులో వెన్నెల

ఫోటో — ఎ. ఎల్. కాంతారావు (సికింద్రాబాద్)

నైనారి చిన్నప్ప

మానంలోకి వచ్చి పడింది.

ఆశతో లచ్చి పైకిలేచి, బాధను మరచి ఆనందంగా అరచింది "మా....వా....."

లచ్చి ఆశించిన వ్యక్తినుంచి జవాబు రాలేదు. కాని 'మావా' అన్న రెండక్షరాలు మాత్రం పాడు పడిన ఆలయంలో ప్రతిధ్వనించడం మాత్రం వింది లచ్చి. మర్రిచెట్టుమీద గూబ కూసింది. ఎక్కడో నట్టడవిలోంచి గుంట నక్క అరుపు వినబడింది. అంతవరకు పరిసరాన్ని పసికట్టని లచ్చి, ఒంటరినన్న జిజ్ఞాస కలగ్గానే భయంతో గడగడలాడిపోయింది. అప్పుడే ఎక్కడినుంచో మానింగిపిల్లి హృదయ విదారకమైన కంఠారావం విన్పించింది. చెట్టుకు చెట్టు, కొమ్మకు కొమ్మ రాపిడి 'క్రఋ' మనే శబ్దం రాకాసి కేకలా విన్పించింది. దడదడలాడే గుండెను ఎంతదాటుగా, మోటుగా చేసుకోవడానికి ప్రయత్నించినా సాధ్యంకాలేదు లచ్చికి. ఇక ఆభయంకర భీకర వాతావరణంలో క్షణమైనా ఆగలేకపోయింది లచ్చి. ఆలయంలోకివెళ్లి, అమ్మవారి విగ్రహం ముందు నిల్చుంటే అభయప్రదాయిని, శత్రుభయంకరిణి, జగజ్జనని అయిన ఆ మాత ఎదుట ఏ ఆపదా రాదనే నమ్మకం కలిగింది లచ్చికి.

మంటపం ముందునుంచివెళ్లి ఆలయ ద్వారాన్ని సమీపించింది. ఎండిన మర్రిఆకుల మీదమళ్లీ సవ్వడి అయింది. పోతున్నదల్లా ఆగి ఆశతో వెనుదిరిగి చూచింది లచ్చి.

విషాదచ్ఛాయలు అలుముకొని, మలినాన్ని పులుముకున్నట్లున్న లచ్చి మొహం క్షణంలో ప్రఫుల్లవికసిత వదనారవిందమైంది. భయముతో కలంగి చెలంగిన ఆమె డెందము సంతోష తరంగాలలో తేలియాడింది. ఆలయ ద్వారం చెంతనుంచి ఒక్క ఊపులో వచ్చి, లచ్చి రంగన్న మామ పాదాలమీద వాలిపోయింది. లచ్చి కన్నుల్లోనుంచి ధారాపాతంగా కారిన కన్నీళ్లు రంగన్న మామ పాదాలను ముద్దు ముద్దచేశాయి.

పాదాల మీదనున్న లచ్చిని రెండు చేతులతో లేవనెత్తి హృదయానికి గట్టిగా హత్తుకున్నాడు రంగన్న. లచ్చి కన్నీళ్లను చేత్తో తుడుస్తూ ఆమె కళ్లలోకి చూశాడు. అమాయకత్వంతో దీనత్వం మిళితమై, ఏకంగా లచ్చి కళ్లచూపుల్లో ద్యోతకమైంది.

"ఎందుకే ఏడుస్తుండావు లచ్చీ?"

"కోడి కునుకుతీసే ఏళకాడొచ్చాను. రాయి కరిగేపొద్దు కాడ రమ్మని నువ్వాలస్యంచేసేవ్ మావా."

"అవునే! మా అయ్య మనమింద కన్నేసి' నన్ను రానీకుండా కాపేసిఉంచాడు. కన్నుగప్పి కదిలొచ్చేళకు ఈ యేళయింది లచ్చీ" అంటూ లచ్చిని బండమీద కూర్చోబెట్టి, లచ్చి సరసను తనూ కూర్చున్నాడు రంగన్న.

"లచ్చీ! ఒక మాటడగాలనుందే!"

"ఏందో? 'కొత్తదానికి బొట్టుకట్టాలనుందే! నువ్వేమంటావో' అనేనా?"

"తూ! ఆమాటెత్తదు. ఆడు...నరిసిగాడు

# కాళికాలయం

లేడూ!.....ఆడి పక్కలించాల్లే! అదికాదింకొకటి."

"ఏందో అడుగరాదూ?"

"అయితే సరిగ్గా అను!. . .నీ కడుపులోని సిట్టోడేవంటాడే....?" లచ్చిని సందిట్లో పొదువుకొని అనురాగంగా అడిగాడు రంగన్న.

ఆమాట చెవిని పడగానే లచ్చి సిగ్గుపడిపోయింది. లచ్చి రెండు చెంపలు కెంపులై రాగరంజితాలయ్యాయి. మొహంలో సిగ్గు దొంతరలు చిందులాడాయి. ఆ అనురాగలహరిలో కొంతసేపు మేను మరిచింది లచ్చి.

అంతలోనే రంగన్న యోచనలో పడిపోయాడు. ధ్యానముద్రలోని యోగీశ్వరునిలా అరమోడ్పు కన్నులలో దేనినో ధ్యానిస్తున్నాడు రంగన్న. కంటున్న కలలోనుంచి మేల్కొంది లచ్చి. మళ్లీ లచ్చిని భయ మావహించింది.

"ఏందాలోచిస్తుంట!.... మావా! నిన్నే."

రంగన్న ధ్యానముద్రలోనుంచి మేల్కొన్నాడు.


"లచ్చీ! సత్తె ప్రమాణంగా ఒకటడుగుతా చెప్పు?..... నీ కడుపులోని పాపోడు నావాడేనా?"

ఆమాటలు చెవిని పడగానే లచ్చికి తలమీద పిడుగు పడినట్లయింది. ఆపాదమస్తకం కంపించిపోతూ అంది లచ్చి: "జారకలబండవార, జామచెట్టుబాయికాడ, ఎంగన్నకుంట కింద, ఏడు తూముల జొన్నచేనుకు, కావలికాస్తూ మంచెమీదుంటే, పొద్దు గూట్లో పడే ఏళకాడ, పారభుజాన పెట్టుకొని, సింగన్నమడికి మడవ కట్టేదానికొచ్చి, పాటపాడేనన్ను ఎనుకపాటునొచ్చి, వాటేసుకొని మంచెమీదనుంచి దాటేసుకొని పోలేదా?......

"పుంగనూరి పూలతేరునాడు సిలకరంగు సీరతెచ్చియిచ్చి 'లచ్చీ! నువ్వు నాపాణానివి' అని పిచ్చి ఆశచూపి పెళ్లాడేనని మాటిచ్చి, నా మానాన్ని దోచుకోలేదా? అదంతా గ్యాపకానికి రాలేదా మావా?.....!"

రంగన్న మౌనముద్ర మానలేదు.

"మావా! నీకీఅనుమానమేలొచ్చింది మావా? గుడిలోని కాళికామ్మోరు పాదాల ఆనగా, నా కడుపులోని గుడ్డు నీదేమావా! సత్తె ప్రమాణం చేసేను. నామాట నమ్ము" అంది లచ్చి



కన్నీరు కారుస్తూ. రంగన్న విలపిస్తున్న లచ్చి మొహంలోకి అయోమయంగా చూశాడు. రంగన్న కళ్లలో కూడా నీళ్లనిల్చాయి. రంగన్న అప్రయత్నంగా అన్నాడు. "లచ్చీ....!"

"మావా! అనుమానాన్ని మానేయ్. మనసులో 'మురికి' పెట్టుకుని నాకన్యాయంచేసి నా బతుకు గంగపాలు చేయొద్దు. పదా, కాళికామ్మోరు గుడిలోకి! కాళికమ్మోరు గుడిలో, అమ్మముందు కానక్కాయబొట్టు నామెడలో కట్టు. ఏడుకొండల ఎంకన్న సాచ్చిగా, వూరిముందున్న గుడిలోని గౌరమ్మపాదాలతోడుగా ఆనబెట్టి కాళికమ్మోరుముందు నీకాళ్లకు మొక్కుతా! ఆయేళకాడనుంచి నువ్వూ..మొ..గు..డి..వి నేను నీ......" సిగ్గుపడి పోయింది లచ్చి.

సిగ్గుపడిన లచ్చిని చేతుల్లోకి లాక్కుంటూ అన్నాడు రంగన్న.

"పిల్లా! నీకన్యాయం చేయాలని ఆలోచిస్తుండలేదే!. మాఅయ్య అడినమాటలు గ్యాపకానికొస్తేను........"

"యామన్నాడేమిటి...?"

"ఆ! యామంటాడు? అదోటక్కులమారి ముండ. దాని వల్లో సిక్కుపడేవ్..! దాన్నే కట్టుకుంటే ఎరకుంట కింద ఉండే ఏడేదుముల మడిలో భాగం కాని, బోడిబండచేన్లో బారెడు భూదేవికాని, ఉండేకొంపలో జానెడు జాగాకాని ఉన్నాదే! అయితే మనం బతికేదెట్లా అని అంటూ ఉండే లచ్చీ."

"ఆడి కడుపుమండ! అంతమాటనేశాడా?.... ఐనా మొగాడివి. మైగా మొగాడివి. నువ్వే ఇట్లా నీళ్లగారిపోతే ఎట్లాగ మావా! ఈ వూరిడిసెళ్లిపోతే బతకలేమా? ఏడకిపోయినా, ఏమురాజింట్లో పాలికాపుగా పడిఉండినా, బతుకు బయిక్కపోతుందా? లేదా కూలినాలి చేసి కుండ కాల్చుకోలేమా?.... పుట్టింది కట్టాల్లో, పెరిగింది కట్టాల్లో, బతికేదీ కట్టాల్లోనే! ఇది రోజుకొత్తేమీ కాదు గద మావా?.... మనలాటోళ్లం కట్టాలు పట్టానికే కదూ ఈ భూమ్మీద పుట్టింది" అంది రంగన్న మామకు ధైర్యాన్నిస్తూ లచ్చి.

"లచ్చీ! అచ్చెరాలా 'భారియ'గా మాటనేవ్! నీమాటలతో కొండంత ధైర్యమొచ్చింది నాకు. అమ్మోరుగుడిలోకి పదా. పసుపుదారం మెడలో కడుతా" అన్నాడు రంగన్న ధైర్యంగా.

"పసుపుదారం కడితే చాలేం?...కానక్కాయున్నా వద్దా?" సిగ్గుగా కొత్త పెళ్లికూతురై అడిగింది లచ్చి.

"కానక్కాయెందుకు ? ఏయేళ కెట్లవుతుందోనని జాగ్రత్తపడి మా అయ్య చేపించి ఉంచిన అసలు 'బొట్టు' తెచ్చేను.... ముందు అమ్మోరుగుడిలోకి పదూ!" అంటూ లచ్చి ఎడమచేతిని పట్టుకున్నాడు రంగన్న.

సిగ్గు పెళ్లి కూతురై, రంగన్న మామ వెంబడి ఆనందంగా కాళికాలయంలోకి వెళ్లింది లచ్చి. ★